మేడలో దెయ్యం

ప్రతాప రవిశంకర్

"కూర్చోండి" అన్నాను. నా ఎదురుగా టేబిల్‌కు అవతల నున్న కుర్చీలో కూర్చున్నాడాయన.

టేబిల్ మీద సిగరెట్టు ప్యాకెట్టును అందుకున్నాను. ఆయన నన్నే చూస్తున్నాడు. ఓ సిగరెట్టును నా పెదవుల మధ్య పెట్టుకుని ఇంకో సిగరెట్టు ఆయనకు ఇచ్చాను.

"థాంక్స్" అన్నాడు. దాన్ని తన దగ్గరవున్న లైటర్‌తో వెలిగించి పొగ పీల్చి "నా పేరు మహేంద్ర. ఆయిల్ ఎక్స్‌పోర్టింగ్ బిజినెస్ చేస్తున్నాను" అని చెప్పాడు.

తల వూపాను పొగ బయటకు వదులుతూ.

"మీ సహాయం కోసం వచ్చాను" అన్నాడు.

"చెప్పండి" అన్నాను.

ఆయన వయస్సు యాభై అయిదుకీ అరవైకీ మధ్య వుంటుంది. కాని అంత వయసున్నవాడిలా అనిపించటం లేదు.

"ఈ మధ్య నేనొక మేడను చాలా చౌకగా కొన్నాను. సుమారు ఆ మేడ మూడులక్షల పైనే చేస్తుంది. కాని నేను దాన్ని ఎనభైవేలకు కొన్నాను" అని ఆగాడాయన.

"అంత చీప్ గా ఎలా వచ్చింది? అమ్మిన వాళ్ళకు ఎస్సెట్ వాల్యూ ఎస్టిమేట్ వెయ్యటం తెలీలేదా?" అడిగాను నవ్వుతూ.

"కాదు. అన్నీ తెలిసే దాన్ని ఆ ఖరీదుకు అమ్మేశారు. అసలు ఆ మేడను కొనటానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. నేనే ధైర్యంచేసి కొన్నాను."

"అర్థమయింది. అదేదో దయ్యాల మేడ అయి వుంటుంది" అన్నాను.

మహేంద్ర "సరిగ్గా వూహించారు. అదే కారణం. అందరూ దాన్ని దయ్యాల మేడ అనే అంటారు. అందుకే దాన్ని కొనటానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. దాన్ని అమ్మచూపుతూ నాలుగు నెలల క్రితం పేపర్లో పడింది. నేను సంప్రదించాను ఆ ఇంటి ఓనర్ని.

ఆయనే అది దయ్యాల మేడ అనే విషయం చెప్పాడు. నేను ఆశ్చర్యపోయాను. అయితే ఆ మేడ ఆయనది కూడా కాదుట. మువ్వయ్యేళ్ళక్రితం దాన్ని యెవరిదగ్గరో కొన్నా డుట చవగ్గా. కొన్న నెల రోజుల్లోనే దాన్ని ఖాళీచేసి వేరే చోటుకి వెళ్ళిపోయాడుట. కారణం అందులో దయ్యం తిరుగుతుందని చెప్పాడు. నేను నమ్మలేదు.

అయినా అంత పెద్దమేడ ఎనభయివేలకి వస్తోంది. అందుకే వూరుకోలేక కొనేశాను.... దాన్ని పూర్తిగా బాగుచేయించాను. కాని ఇంతవరకు సంసారాన్ని ఆ మేడ లోకి మార్చలేక పోయాను."

"ఎందుకు?" అడిగాను.

"నా భార్య ఒప్పుకోటంలేదు. ఆమెకు దయ్యాలన్నా భూతాలన్నా చెప్పలేని భయం. అందుకే తను ఆ మేడ కొంటానంటే ఒప్పుకోలేదు. కాని దాన్ని ఎవరికయినా అద్దెకిస్తానని చెప్పి దాన్ని కొన్నాను. బాగు చేయించిన తర్వాత అందులోకి ఎవ్వరూ అద్దెకు కాదుగదా ఫ్రీకే వచ్చి వుండమన్నా రారని తెలిసిపోయింది. ఆ మేడ గురించి అందరికి తెలుసుట.

దాన్ని ఖాళీగా వుంచటం ఇష్టంలేక నా ఫామిలీని ఆ మేడలోకి మారుస్తానన్నాను. కాని నా భార్య తను ఆ మేడలోకి రానంటోంది. మిగిలినవాళ్ళు—అంటే నా ఇద్దరు కూతుళ్ళూ, కొడుకూ ఒప్పుకున్నారు. వాళ్ళకు నాలాగే దయ్యాలంటే నమ్మకం లేదు. దయ్యం యెలా వుంటుందో చూడాలనే క్యూరియాసిటీతో వున్నారు. కాని నా భార్యే ఆ మేడలోకి రానంటోంది...." చెప్పాడాయన....

సిగరెట్టును యాష్ట్రేలో కుక్కి "ఇంతకీ నా సహాయము మీకు ఏ విధంగా కావాలో చెప్పలేదు" అన్నాను.

"చెబుతాను. ముందు నాకు ఈ విషయం చెప్పండి. మీకు దయ్యాలమీద నమ్మకం వుందా? దయ్యాలున్నాయంటే నమ్ముతారా?" అనడిగాడు మహేంద్ర.

"దయ్యాలున్నాయి" అన్నాను నవ్వుతూ.

మహేంద్ర ఆశ్చర్యపోయాడు.

"మీరు డిటెక్టివ్‌లు. డిటెక్టివ్‌లుకూడా దయ్యాలున్నాయంటే నమ్ముతారా?" అన్నాడు.

"డిటెక్టివ్ అయినంత మాత్రాన దయ్యాలున్నాయని

నమ్మకూడదని ఎక్కడా లేదు. నా నమ్మకం నాది. కొంత మంది మేధావులే దయ్యాలున్నాయని ఒప్పుకున్నారు. మానవాతీతమయిన శక్తులు తప్పకుండా వున్నాయి. వాటినే మనం దయ్యాలనుకోవచ్చు. ఇంకేమయినా అనుకోవచ్చు."

ఆయన ఒక్క క్షణం ఏదో ఆలోచించి "ఆల్ రైట్, మీ నమ్మకంతో నాకు పనిలేదు. నేను దయ్యాలున్నాయంటే నమ్మను. నేనేకాదు నా యింట్లో నా భార్య తప్పించి ఎవ్వరూ నమ్మరు. ఇప్పుడు నేను మీ దగ్గరకు వచ్చింది నా భార్యనుకూడ ఆ మేడలోకి తీసుకువెళ్ళే ప్రయత్నం గురించే. మీరు నాకు ఏ విధంగా సహాయపడాలో చెబుతాను" అని యింకో సిగరెట్టు ముట్టించాడు మహేంద్ర.

నిజంగా ఇది నాకు కొత్తకేసే. ఇలా నా దగ్గరకు వచ్చేవాళ్ళకు దయ్యాలంటే నమ్మకం ఉంటుంది. కాని మహేంద్రకు లేదు.

నేనుకూడా సిగరెట్టు వెలిగించి "చెప్పండి" అన్నాను.

"మీ పరిశోధనల గురించి నా భార్యకు బాగా తెలుసు. మీరు మంచి డిటెక్టివ్ అనే అభిప్రాయం మా ఇంట్లో అందరికీ వుంది. అందువల్ల మీరు నాతో మా యింటికి రండి. నా భార్యతో మాట్లాడండి. దయ్యాలనేవి లేవనీ కేవలం మనుషుల భయంవల్లనే అటువంటి భ్రమ కలుగుతుందనీ ఆమెతో చెప్పండి. ఆమెకు దయ్యాలమీద వున్న నమ్మకాన్ని పోగొట్టండి. ఎలాగయినా ఆమె మాతో పాటు ఆ కొత్తమేడలోకి వచ్చేలా చెయ్యండి" అన్నాడు మహేంద్ర.

నవ్వాను....మహేంద్ర బాగా తెలివయిన మనిషిలా

అనిపించాడు. నా నమ్మకం గురించి ఆయనకు చెప్పినా కూడా తన భార్యను ఒప్పించటం కోసం నన్ను అబద్ధాలు చెప్పమని అడుగుతున్నాడు.

"క్షమించండి. దయ్యాల నేవి లేవని నేను మీ భార్యకు చెప్పలేను. ఎందుకంటే నా దృష్టిలో దయ్యాలున్నాయి. అయినా అసలు దయ్యాలు వున్నాయా? లేవా? అని మీ భార్యకు చెప్పటం అంత ముఖ్యం కాదు అనుకుంటాను. ఆ మేడలో దయ్యాలు వున్నాయో లేవో తెలుసుకోవటం ముఖ్యం.

ఎక్కడో దయ్యాలు వుంటే ఎవరికీ నష్టంలేదు. కాని ఆ మేడలో అందరూ అనుకుంటున్నట్టుగా దయ్యాల నేవి వుంటే మీకు నష్టం....కాబట్టి ఆ మేడలో దయ్యాలు వున్నాయో లేవో తేల్చి చెప్పమంటే చెబుతాను" సిగరెట్టు పొడి రాల్చుతూ అన్నాను.

మహేంద్ర వెంటనే మాట్లాడలేదు. చాలా సేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఆల్ రైట్....మీరు చెప్పింది నాకు సరయినదిగానే అనిపిస్తోంది. ఆ మేడలో దయ్యాలున్నాయనే నమ్మకం నాకులేదు. నా భార్యకు వుంది. నా భార్య భయం పోగొట్టటం నాకు ముఖ్యం. కాబట్టి మీరు మాతోపాటు ఆ మేడలోకి రండి. మాతో వుండి ఆ మేడలో దయ్యాలున్నాయో లేవో పరిశోధించి చెప్పండి. నిజంగా దయ్యాలుంటే ఆ మేడను వదిలేస్తాం....లేకపోతే నేను యెంతో సంతోషిస్తాను....ఏమంటారు?" అన్నాడు.

"మీ ఇష్టం. మీరు ఆ కొత్తమేడలోకి యెప్పుడు ప్రవేశిస్తారో చెప్పండి. నేనుకూడా వస్తాను."

"అలాగే. ఈరోజు సాయంత్రం ఓసారి మా ఇంటికి

రండి. నా భార్యతో మాట్లాడండి. మీరుకూడా మాతో వస్తున్నారంటే ఆమె సంతోషిస్తుంది. తర్వాత మీ పరిశోధన ప్రారభించవచ్చు."

సరే నన్నాను.

"థాంక్స్ జగదీష్‌గారూ .... ఇక నే వెళతాను. సాయంత్రం తప్పకుండా ఆరుగంటలకు మా యింటికి రండి. మీకోసం ఎదురుచూస్తూ వుంటాం...." అని తన ఎడ్రసువున్న కార్డుయిచ్చి వెళ్ళిపోయాడు మహేంద్ర.

మేడలో దయ్యం గురించి ఆలోచనలో పడిపోయేను.

2

సాయంత్రం ఆరుగంటలయింది.

స్కూటర్‌ని మహేంద్ర ఇంటిముందుకు పోనిచ్చి ఆపాను. గేటు తెరిచే వుంది. లోపలకు వెళ్ళి ఆపాను.

బయటకు వచ్చిన మహేంద్ర నన్ను నవ్వుతూ విష్‌చేసి "రండి" అంటూ లోపలకు తీసుకువెళ్ళాడు.

బయటకంటే కూడా మహేంద్ర ఇల్లు లోపల బావుంది. చిన్న మేడ అయినా నీట్‌గా వుంది.

హాలులో కూర్చున్నాము.

తన వాళ్ళందరినీ పరిచయం చేశాడు మహేంద్ర.

ఆయన భార్య రంజితకు నలభయి అయిదేళ్ళు పయినే వుంటాయి. అయినా ఆమె అంత వయసువున్న మనిషిలా కనిపించలేదు. ఆమె అలంకరణే అందుకు కారణమనుకుంటాను. వంటినిండా నగలు వున్నాయి. మంచి ఖరీదయిన చీర కట్టుకుంది. జుట్టును ఫాషన్‌గా ముడివేసుకుంది. చెవులకు ఎర్రరాతి దుద్దులు. పెదవులకు లిప్‌స్టిక్. లావుగా పొడుగ్గా వుంది.

మహేంద్ర ఇద్దరు అమ్మాయిలుకూడ అందంగానే

వున్నారు. ఆయన పెద్దకూతురు అరవింద, తన చెల్లెలు సుకన్యకంటే అందంగా వుంది. అరవిందకు పాతికేళ్ళ వరకూ వుంటాయి. మాచింగ్ డ్రెస్ వేసుకుంది. సింపుల్‌గా అలంకరించుకుంది. మెళ్ళో ఓ గోల్డు చెయిన్ వుంది. చెవులకు రింగులు. రెండు చేతులకూ ఒక్కో గాజు. నవ్వు మొహం.

సుకన్య కొంచెం సన్నగా, పొడవుగా వుంది. కోల మొహం. ప్యాంటు, షర్టు వేసుకుంది. ఎడమ చేతికి వాచీ, చెవులకు రింగులు. రిజర్వ్డుగా వుండే మనిషిలా అనిపించింది చూడగానే.

మహేంద్ర ఒకే ఒక్క కొడుకు సురేష్‌కు పదిహేను ఏళ్ళున్నాయి. ఎర్రగా, బొద్దుగా వున్నాడు. మంచి యాక్టివ్ మనిషిలా అగుపించాడు.

"మీరయినా ఈయనకు చెప్పండి జగదీష్‌గారూ.... ఇప్పుడు ఆ దెయ్యాల మేడలోకి వెళ్ళకపోతే ఏమయ్యింది? నాకు దయ్యాలున్నాయంటే నమ్మకంతో పాటు అవంటే బాగా భయంకూడా వుంది. నేను అందుకే ఆ మేడలోకి రానని అంటున్నాను. కాని నా మాటను ఎవ్వరూ వినడము లేదు. నాకు తప్పించి యీ యింట్లో యెవ్వరికీ దయ్యాలంటే నమ్మకం లేదు. అది నా దురదృష్టం.... మీరయినా నా బాధను అర్థం చేసుకొని వీళ్ళకు నచ్చ చెప్పండి" అన్నది మహేంద్ర భార్య రంజిత.

అందరం హార్లిక్స్ తాగుతున్నాం.

భార్య మాటలకు భర్త ఆమె కూతుళ్ళు — కొడుకూ నవ్వారు.

"నువ్వు ఇంత పిరికిదానవేం మమ్మీ. అసలు దయ్యమంటే ఎలా వుంటుంది? చెప్పు...." అన్నది అరవింద.

"దాని అంతు చూస్తాను" అన్నాడు సురేష్.

"ఇదీ జగదీష్‌గారూ వీళ్ళ వరస. ఇలా నన్ను వేధిస్తున్నారు" అన్నదామె నాతో.

ఆమె మాటలకు నవ్వి...."మీరు భయపడ వలసిన అవసరం ఏ మాత్రంలేదు రంజితగారూ — నేనుగూడా మీతో ఆ దెయ్యాల మేడలోకి వస్తాను. దెయ్యాలు ఆ మేడలో వున్నాయో లేవో తేలేవరకూ మీతోనే కలసి వుంటాను. నామీద మీకు ఏ మాత్రం నమ్మకం వున్నా ఆ మేడలో తిరుగుతున్న దెయ్యాల గురించి భయపడకండి. మీరు మీ ఇంట్లో మిగిలిన మనుషుల్లా నిశ్చింతగా వుండండి" అన్నాను.

"నేను ఆ ధైర్యంతోనే ఆ మేడలోకి వీళ్ళతో రావటానికి ఒప్పుకున్నాను. ఈయన ఉదయం మిమ్మల్ని కలుసుకున్నట్టు మీరు మాతో ఆ మేడలోకి వస్తున్నట్టు చెప్పారు. అప్పుడు నాకు ధయిర్యం వచ్చింది. చూద్దాం, యెవరి నమ్మకం గెలుస్తుందో" అన్నది రంజిత.

"నువ్వే ఒప్పుకోంటావు మమ్మీ దయ్యాలు, భూతాలు అనేవి లేవని. తప్పకుండా నువ్వే ఓడిపోతావు. ఎవరో పిరికివాళ్ళు సృష్టించినవి ఈ దయ్యాలు, పిశాచాలు...." అన్నాడు సురేష్ నవ్వుతూ.

"ఒరేయ్....అలా అనకు" అన్నది రంజిత.

వాళ్ళందరూ కలిసి రంజితను పెడుతున్న అవస్థను చూస్తే నాకు నవ్వొచ్చింది. పాపం.... ఈ దెయ్యాల గొడవలో ఆమెకు సపోర్టులేదు. ఒంటరిదయిపోయింది.

"మరి నే వెళ్ళొస్తాను. మీరు ఎప్పుడు ఆ మేడలోకి ప్రవేశిస్తారో చెప్పండి. నేను సిద్ధంగా వుంటాను...." అన్నాను లేచి నిలబడి మహేంద్రతో.

ఆయన తల వూపాడు.

"థాంక్స్ జగదీష్‌గారూ....మీతో కొన్ని రోజులు గడిపే అదృష్టాన్ని పొందుతున్నందుకు సంతోషంగా వుంది" అన్నది అరవింద.

"థాంక్స్" అన్నాను.

వాళ్ళందరి వద్దా సెలవు తీసుకొని బయటకొచ్చాను.

దీపాలు అంతటా ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

"గుడ్ నైట్" అన్నది అరవింద.

"గుడ్ నైట్" అని స్కూటర్ స్టార్టు చేశాను.

రివ్వున దూసుకుపోతోంది స్కూటరు. నా కళ్ళ ముందు అరవింద రూపం కదులుతోంది.

3

"ఇతనెవరు?" అడిగాను మహేంద్రను. ఆయన ఇంట్లో నాకు ఓ అపరిచిత వ్యక్తి కనిపించాడు.

"హి ఈజ్ మిస్టర్ చంద్రం. నా చెల్లెలి కొడుకు. నిన్న సాయంత్రమే పూర్నించి వచ్చాడు" అని నన్ను అతనికి పరిచయం చేశాడు మహేంద్ర.

"వెరీ గ్లాడ్ టు మీట్ యూ" అని కరచాలనం చేశాడు చంద్రం.

కొంచెం లావుగా పొడుగ్గా వున్నాడతను. ఆకర్షణీయమైన మొహం. వైట్ ప్యాంటు, స్కయ్ కలర్ షర్టు వేసుకున్నాడు. మీసాలు లేవు. పక్కకు దువ్విన క్రాపు. చిన్న కళ్ళు.

"మీ పరిశోధనల గురించి ఇంతకుముందు చదివాను. ఇప్పుడు స్వయంగా చూడబోతున్నాను" అన్నాడు చంద్రం నవ్వుతూ.

"మీరు ఇప్పుడేం చేస్తున్నారు?" అడిగాను.

"ఎమ్మే ఎగ్జామ్స్ రాశాను."

"మీరు వుండటం ఎక్కడ?"

"రాజమండ్రి."

ఆ తర్వాత అతను ఆ దయ్యాల మేడ గురించి మాట్లాటడం మొదలుపెట్టాడు.

"ఇందకీ మీకు దయ్యాలమీద నమ్మకం వుందా?" అడిగాను చంద్రంని నవ్వుతూ.

"దయ్యాలా"అని పెద్దగా నవ్వాడు.తర్వాత "వాటిని చూపించండి సార్. పట్టుకుని ఆడిస్తాను" అన్నాడు.

"మొత్తానికి ధైర్యవంతులే" అన్నాను.

"ధయిర్యం కాదు జగదీష్‌గారూ. దయ్యాల నేవి లేవనే గట్టి నమ్మకం. అంతకంటే ఏమీ లేదు. మనం సైన్సు దృష్ట్యా ఎంతో ముందుకు వెళుతున్నాం. కాని ఈ దయ్యాలు, భూతాలు అనే భయాలనుండి, భ్రాంతులనుండి బయట పడలేకపోతున్నాం. మీ లాంటి డిటెక్టివ్‌లు కూడా దయ్యాలున్నాయని నమ్మటం నాకు వింతగా వుంది" అన్నాడు అతను.

అతని మాటలకు నవ్వకుండా ఉండలేకపోయాను. నవ్వి "మనకంటే మేధావులే దయ్యాలు ఉన్నాయని ఒప్పుకున్నారు. మీ కంటికి కనిపించనంత మాత్రాన ఏదీ లేదని అనటం అంత న్యాయం కాదు. గాలి మనకు కనిపించదు. కాని దాని ఫలితాన్ని మనం అనుభవించ గలుగుతున్నాం. అలాగే దయ్యం కూడా. అది మనకు కనిపించకపోవచ్చు. దాని రిజల్టు మనకు కనిపించవచ్చు. అప్పుడు దాన్ని నమ్మక తప్పదు. నిజంగా ఆ మేడలోనే దయ్యం వుంటే ఈ విషయాలను మీరే ఒప్పుకుంటారు" అన్నాను.

"చూద్దాం....ఎప్పటినించో నాకు ఈ దయ్యాల గొడవ తేల్చుకోవాలనే ఆలోచన వుంది. అది ఈ రోజున నెరవేరబోతోంది" అన్నాడు.

ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు మేమందరం ఆ కొత్త మేడలోకి ప్రవేశించాము.

బయల్దేరేముందు కూడా మహేంద్ర భార్య రంజిత "మీరు వున్నారనే ధైర్యంతోనే వస్తున్నాము జగదీష్ గారూ. లేకపోతే వీళ్ళు నన్ను బతకనివ్వరు" అన్నది నవ్వుతూ.

నిజమే. ఆమెకు సపోర్టు నేనొక్కడినే. చివరికి ఆ ఇంట్లో వంటవాడికీ, నౌకరుకి కూడా దయ్యాలున్నాయంటే నమ్మకం లేదు.

ఆ మేడలో నిజంగా దయ్యం ఉందో లేదోగానీ ఒక వేళ ఏ దయ్యమూ ఆ మేడలో లేకపోతే మహేంద్ర అదృష్టవంతుడే. ఎందుకంటే ఆ మేడ లక్షల విలువ చేస్తుంది. అంత పెద్ద మేడ అది. ఎన్నో విశాలమైన గదులు ఉన్నాయి.

ఆ మేడ కొన్నాళ్ళు పాడుబడిపోయి వుందనీ, ఆ తోట కొన్నాళ్ళు ఆలనాపాలనా లేకుండా ఉన్నదంటే ఎవ్వరూ నమ్మరు. దానిని మహేంద్ర పూర్తిగా మార్చేశాడు. దాన్ని బాగుచేయించడానికి ఆయన చాలా డబ్బు ఖర్చు చేశాడని తెలుస్తోంది.

ఆ మేడలో అన్ని వసతులూ వున్నాయి. రెండు మూడు గదులకు కలిపి ఓ బాత్ రూం వుంది. మేడకు రెండువైపులా మెట్లు. విశాలమైన హాలు. పెద్దపెద్ద తలుపులు. ముందు ఎంతో ఖాళీ ప్రదేశం. ఓ పక్కగా

తోట. తోటలో పెద్ద పెద్ద చెట్లు వున్నాయి. చుట్టూ కుండీల్లో రకరకాల పూల మొక్కలు.

"బ్యూటీఫుల్. ఈ మేడలోనా దయ్యాలు వుండేది?" అని పెద్దగా నవ్వాడు చంద్రం.

"అవును జగదీష్‌గారూ. ఈ మేడను చూశారు గదా. మీ కేమని అనిపిస్తుంది? ఈ మేడలో దయ్యాలు వుండొచ్చు అనిపిస్తోందా?" అని అడిగాడు మహేంద్ర.

అందరం హాలులో వున్న సోఫాల్లో కూర్చున్నాము.

వంటవాడు అందరికీ కాఫీ తీసుకువచ్చి ఇచ్చాడు.

తాగుతున్నాము.

"అంటే మీ ఉద్దేశం ఏమిటి? అందంగా ఉండే మేడల్లో దయ్యాలు వుండకూడదనే రూలు ఏదయినా వుందా?" అడిగాను కప్పును టీపాయ్ మీద వుంచి.

"కరెక్టు. అలా అడగండి" అన్నది రంజిత భర్తను చూపిస్తూ.

"నా ఉద్దేశం అదే. దెయ్యాలు, భూతాలు, స్మశానాల్లో వుంటాయిగానీ ఇళ్ళలో వుండవు" అన్నాడు మహేంద్ర కొడుకు సురేష్.

"అంటే అసలు దయ్యాలనేవి వున్నాయని ఒప్పుకుంటున్నట్టేగా" అన్నాను అతన్ని.

"సారీ. నలుగురూ అనుకునేదాని గురించి చెప్పాను. నాకు దెయ్యాలమీద నమ్మకంలేదు" అన్నాడతను వెంటనే.

"అన్ని గదులూ చూశారా జగదీష్‌గారూ" అడిగింది అరవింద వక్కపొడి నములుతూ.

"ఇంకా కొన్ని గదులు చూడలేదు" అన్నాను.

"ఇంతకీ మీకు ఏ గది కావాలో సెలక్టు చేసు

కున్నారా?"

"ఇంకా లేదు. మీ గదుల సెలక్షన్ అయిపోయిందా?"

"ఆ. నేను మేడమీద మెట్లవయిపు నుంచి రెండో గదిని తీసుకున్నాను. నా గది పక్కనున్న గది ఖాళీగానే వుంది. ఆ తర్వాత గదులను వరుసగా సుకన్య, చంద్రం, సురేష్, డాడీ మమ్మీ తీసుకున్నారు. మరి మీకు ఏ గది కావాలో నిర్ణయించుకోండి" అన్నది నవ్వి.

"క్రింద గదుల్లో ఎవరు వుంటారు?" అడిగాను.

"వంటవాడు-నౌకరు" అన్నది రంజిత.

"నేను కూడా కింద ఓ గది తీసుకుంటాను" అన్నాను.

"క్రింద గదా! వద్దండీ! ఆసలే నేను భయంతో చస్తున్నాను. మీరు పైనే ఓ గదిలో వుండండి ఈ గొడవేదో తేలేవరకు. నాకు కొంచెం ధైర్యం వుంటుంది" అన్నది రంజిత.

"నువ్వు మరీ చిన్నదానిలా బిహేవ్ చేస్తున్నావ్ రంజితా. నేను లేనా? ఎందుకంత భయం?" అన్నాడు మహేంద్ర కొంచెం ఫీలయ్యి.

"మీరున్నారుగదా అంటారా. ఏం లాభం. నిజంగా ఏ దయ్యమో కనిపించి కేకపెడితే నిద్రకూడా లేవరు" అన్నది నవ్వుతూ.

రంజిత జోక్కి అందరూ నవ్వారు.

"సరే. అలాగే. నేను అరవింద గది పక్కనున్న గదిలో వుంటాను. అంటే మెట్లపక్కనే వున్న గది" అన్నాను.

"థాంక్ గాడ్ అయితే నాకు ఇక ఏ భయమూ లేదు" అన్నది అరవింద.

"దొరికిపోయారు. అయితే మీరు ఈ మేడలో

ఉన్నాయనుకుంటున్న దయ్యాల గురించి భయపడుతున్నా రన్నమాట" అన్నాను.

"నమ్మకం లేకపోయినా సహజంగా కొంత భయం ఉంటుంది కదండీ డిటెక్టివ్ గారూ" అన్నది అరవింద.

నవ్వుతూ సిగరెట్టు వెలిగించాను.

మహేంద్ర మా మాటలను వింటున్నాడు.

అరవింద మాట్లాడుతుంటే ఎంతసేపయినా వినాలని అనిపిస్తోంది. ఆమెనే చూడాలని అనిపిస్తోంది. అరవింద నన్ను ఆకర్షించటానికి ప్రయత్నిస్తున్నదా అనిపించింది.

ఆమె కళ్ళలోకి చూశాను. ఎటువంటి భావమూ కనిపించలేదు.

ఉన్నట్టుండి సుకన్య, సురేష్ లేచి నిలబడ్డారు.

"ఎక్కడికి?" అడిగింది అరవింద.

"తోటలోకి" అన్నాడు సురేష్.

"నేను కూడా వస్తాను" అన్నాడు చంద్రం లేచి నిలబడుతూ.

"పదండి. అందరం కొంచెంసేపు తోటలో తిరిగి వద్దాం" అని లేచాడు మహేంద్ర.

బయటకు వచ్చాము.

నౌకరు గదులలోకి సామాన్లు సర్దుతున్నాడు. వంటవాడు కిచెన్‌లో వున్నాడు.

మేము దయ్యాల గురించి మాట్లాడుకుంటూ తోటలో తిరుగుతున్నాము.

అందరూ మాట్లాడుతున్నారు. కాని సుకన్య మౌనంగా నడుస్తోంది.

సుకన్య మనసు తెలుసుకోవడం కష్టమనపించింది.

చంద్రం ఇష్టం వచ్చినట్టు వాగుతున్నాడు. అరవిందను

ఏవో ప్రశ్నలు అడుగుతున్నాడు. అరవింద అతని ప్రశ్నలకు జవాబులు చెప్పకుండా నన్ను ఏవేవో అడగటం మొదలుపెట్టింది. ఆమెకు అతనితో స్నేహాన్ని పెంచుకోవటం ఇష్టంలేదనే విషయాన్ని గ్రహించాను.

తోటలో తిరుగుతూండగానే చీకట పడింది.

దీపాలు వెలిగాయి.

4

భోజనాలయ్యేసరికి రాత్రి తొమ్మిది గంటలయ్యింది. అందరికీ వక్కపొడి అందించింది అరవింద.

వంటకాలన్నీ బాగా రుచిగా వుండటంవల్ల నేను కొంచెం ఎక్కువగానే తిన్నాను. అందువల్లనే యాక్టివ్‌నెస్ కొంచెం తగ్గినట్లనిపించింది.

వక్కపొడి నములుతూ సిగరెట్లు వెలిగించాము నేను-మహేంద్ర.

"మీరు సిగరెట్లు కాల్చరా?" చంద్రంను అడిగాను.

"కాలుస్తాను. కాని రోజుకు ఒకే ఒక్క సిగరెట్టు కాలుస్తాను. ఇవాల్టి సిగరెట్టు వుదయమే కాల్చేశాను" అన్నాడు.

"గుడ్ కంట్రోల్" అన్నాను నవ్వుతూ.

"ఈ రాత్రి నాకు నిద్రపట్టదు" అన్నది రంజిత మా ఎదురుగా వచ్చి కూర్చుంటూ.

"పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోవద్దు రంజితా. ఏమీ ఆలోచించకుండా నిద్రపోవటానికి ప్రయత్నించు" కసిరాడు మహేంద్ర భార్యను.

ఆయనకు భార్య ప్రతినిముషం ఆ మేడలో వున్న దయ్యం గురించి భయపడటం నచ్చలేదు. ఆమె అలా అనుక్షణం భయపడటం సిల్లీగా అనిపిస్తోంది. కాని ఇటువంటి విష

యాలను నమ్మినప్పుడు సహజంగానే అలా ప్రతిక్షణం భయపడుతూ వుంటారని ఆయనకు తెలీదు.

నేనూ ఈ విషయంలో కలిగించుకుని "మీ కెలాంటి భయమూ లేదు రంజితగారూ. నేను వున్నాను కదా. కావాలంటే నేను మీ గదిముందే ఈ రాత్రి కాపలా కూర్చుంటాను. సరేనా?" అన్నాను.

"థాంక్స్ జగదీష్‌గారూ. మీరు మా గదిముందు కాపలా వున్నారంటే హాయిగా నిద్రపోతాను" అన్నది.

"మమ్మీ దయ్యాలకు కాపలాలు ఇలాంటివి పని చెయ్యవే. అవి ఎన్ని గడియలు పెట్టుకున్నా లోపలకు రాగలవంటారు" అన్నాడు సురేష్ తల్లిని మరింత భయ పెట్టటానికి.

"యూ షటప్. సురేష్ వెళ్ళిపడుకో" కోపంగా అన్నాడు మహేంద్ర.

వెంటనే అక్కడినించి వెళ్ళిపోయాడు సురేష్.

అరవింద, చంద్రం నవ్వారు అతనలా తల వంచుకుని వెళుతుంటే.

"వీడు నన్ను మరీ భయపెడుతాడు జగదేష్‌గారూ" అన్నడి రంజిత.

"నాకూ నిద్ర వస్తోంది. ఇవాళ పగలు కూడా నిద్ర పోలేదు" అని అక్కడినించి లేచాడు చంద్రం.

"సుకన్య ఎక్కడ?" అడిగింది రంజిత.

"భోజనం చెయ్యగానే అది దాని గదికి వెళ్ళి పోయింది" చెప్పింది అరవింద.

"మీరు ఎన్ని గంటలవరకు మెలకువతో వుంటారు?" అడిగాడు మహేంద్ర నన్ను.

"ఈ రాత్రంతా మెలకువగానే వుంటాను. ఇది ఈ

మేడలో మొదటి రాత్రి. నిజంగా ఈ మేడలో దయ్యాలనేవి వుంటే అవి ఈ రాత్రి బయటకు రాకుండా వుండవు" అన్నాను.

"మీకు నిద్రరాకుండా టీ ఏర్పాటు చేస్తాను" అన్నది రంజిత.

"నో థాంక్స్. అలాంటివేమీ అవసరంలేదు. నా దగ్గర సిగరెట్లు చాలా వున్నాయి. అవి వుంటే నిద్ర రాత్రల్లా రాదు" అన్నాను నవ్వుతూ.

పది గంటలయ్యింది.

"ఇక మేము పడుకుంటాం" అన్నాడు మహేంద్ర వాచీ చూసుకుని.

తల వూపాను.

"నీకు నిద్ర రావటంలేదా?" అరవిందను అడిగింది రంజిత.

"నాకు పన్నెండు గంటలయితేగానీ నిద్రరాదు మమ్మీ" అన్నది.

"అయితే నువ్వు అప్పటివరకు డిటెక్టివ్ గారికి కంపెనీ ఇవ్వు. గుడ్ నైట్" అని భర్తతో కదిలింది రంజిత.

"గుడ్ నైట్" అన్నాను నేను మరో సిగరెట్టు వెలిగించబోతూ.

ఆమె రెండడుగులు వేసి వెనక్కి తిరిగి "మీరు మా గదిముందే కాపలా వుంటారు కదూ" అనడిగింది.

"అవును" అన్నాను నవ్వుతూ.

"థాంక్ యూ" అన్నదామె.

"మా మమ్మీకి మరీ భయం ఎక్కువ" అన్నది అరవింద నవ్వి.

"మీకు ధయిర్యం ఎక్కువనుకుంటాను."

"అంత ఎక్కువ కాదు. మమ్మోకంటే నయం."

అందరూ ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఒక్కసారి అలా తోటలో తిరిగివద్దామా?" అన్నాను అరవిందతో.

"పదండి. తోటలో విహరిద్దాం" అన్నది అరవింద లేచి నిలబడి.

ఇద్దరం మేడలోనించి బయటకు నడిచాము.

బయట చీకటిగా వుంది.

తోటలో చెట్లు గాలికి అటూ ఇటూ కదులుతున్నాయి.

ఆ ప్రాంతంలో ఎక్కడా జనసంచారం లేకపోవటం వల్ల అంతా నిశ్శబ్దంగా వుంది.

మేడలో అక్కడక్కడ వెలుగుతున్న దీపాలకాంతి తోటలో చెట్లమీద పడుతోంది.

"ఈ వాతావరణానికి నేనొక్కదాన్నే అయితే భయపడతాను" అన్నది అరవింద.

"ఎందుకు? చీకటిగా వుందనా?"

"అవును. అంతే కాకుండా దయ్యాల్లా ఈ కదులు తున్న చెట్లు."

"అయితే దయ్యాలు చెట్లలా ఉంటాయంటారా?"

"ఏమో. అలా అనిపిస్తోంది."

చిన్నగా నడుస్తున్నాము. నా పక్కనే అరవింద అడుగులు వేస్తోంది. మొక్కల మధ్య అడుగులు వేస్తున్నాము.

అరవింద భుజాలు నాకు రాసుకుంటున్నాయి. గిలి గింతగా వుంది. ఆమె రాసుకున్న ఇంటిమేట్ సెంటు వాసన నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

పెద్ద చెట్టు కిందకు వచ్చాము.

ఉన్నట్టుండి ఆ చెట్టుమీద నించి ఓ పక్షి రెక్కలు పెద్దగా చప్పుడు చేసుకుంటూ ఎగిరిపోయింది చీకట్లోకి.

చిన్న కేకతో — భయపడి అరవింద గబుక్కున నన్ను చుట్టుకుపోయింది.

షాక్....ఏదో విద్యుత్తు నాలోకి ప్రవేశించినట్లు అనిపించింది. అదురుతున్న ఆమె గుండెలు నాకు మెత్తగా తగిలాయి.

"భయపడకండి....అది పక్షి" అన్నాను నవ్వుతూ.

"సారీ...." అన్నదామె నన్ను వదలి.

"ఎందుకు సారీ....మీరు నన్ను నొప్పించలేదు. ఎనీహౌ థాంక్స్" అన్నాను నవ్వి.

అరవింద సిగ్గుపడింది.

వాచీకేసి చూసుకొన్నాను.

పదకొండు గంటలుకు ఇరవై నిముషాలు తక్కువ.

"ఇక మీరు పడుకొంటారా?" అడిగానామెను.

"నాకు అప్పుడే నిద్రరాదు. కనీసం పన్నెండైనా కావాలి. ఇలాగే తిరుగుతూ మాట్లాడుకొందాం."

"ఎక్కడైనా కూర్చుందాం కొంచెంసేపు" అన్నాను.

సరేనన్నది.

తోటలోనుంచి బైటకొచ్చి మేడలోకి నడిచాము. బాల్కనీలో కూర్చున్నాము.

"అందరూ గాఢనిద్రలో వున్నారు" అన్నది అరవింద.

"ఈ మేడలోవున్న దయ్యం గురించి మరచిపోయినట్టు ఉన్నారు" అన్నాను.

"నిజంగా ఈ మేడలో దయ్యం వుందంటే మీరు నమ్ముతారా?" అడిగింది అరవింద.

"ఈ మేడలో వుందో లేదో తెలీదుగాని దయ్యాలు

అనేవి ఉన్నాయి. ఇది నిజం."

"ఏవైనా దయ్యం కేసులను మీరు పరిశోధించారా?"

"దయ్యం కేసులను పరిశోధించలేదు. కాని దయ్యాల పేరుతో మనుషులు నాటకమాడిన కేసులను పరిశోధించాను."

"ఈ మేడలో కూడా అలాగే జరుగుతున్నదేమో."

"తెలుస్తుంది కదా" అన్నాను సిగరెట్టు వెలిగిస్తూ.

అరవింద నా పరిశోధనల గురించి, హంతకుల మనస్తత్వం గురించి అడుగుతోంది.

చెబుతున్నాను.

ఒక్కసారి వాచీకేసి చూసుకొంటే పన్నెండు గంటలయింది.

"ఇక మీరు వెళ్ళి పడుకోండి....పన్నెండు దాటింది. నేను ఒకసారి మేడంతా తిరిగి వస్తాను" అన్నాను.

అరవింద అయిష్టంగానే నిలబడింది.

ఇద్దరం ఆమె గది దగ్గరకు నడుస్తున్నాము.

నాలుగడుగులు వేసేసరికి ఆ మేడ పెద్ద పొలికేకతో ప్రతిధ్వనించింది.

ఉలిక్కిపడింది అరవింద.

"ఎవరా కేక పెట్టింది? సుకన్యా?" భయంగా అడిగింది అరవింద.

"కాదు....మీ అమ్మ రంజిత" అని ముందుకు పరుగు తీశాను.

5

రంజిత—మహేంద్ర పడుకొని వున్న గది తలుపుమీద దబదబా బాదాను.

భళ్ళున తలుపులు తెరచుకున్నాయి.

ఎదురుగా మహేంద్ర నిలబడి వున్నాడు. ఆయన జుట్టంతా చెరిగివుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి.

"ఏమిటి? ఏమయ్యింది? రంజితగారు యెందుకలా కేక పెట్టారు?" గబగబా అడిగాను.

"ఏమో! నాకు తెలీదు?" అన్నాడు మహేంద్ర.

గదిలోకి నడిచాను. నా వెనుకే అందరూ వచ్చారు. చంద్రం—సుకన్య—సురేష్ — అరవింద — వంటవాడు— నౌకరు.

బెడ్ మీద కూర్చుని ఏడుస్తోంది రంజిత.

ఆమె గుండెలు అదురుతున్నాయి. ఆమె వీపు యెగిరి పడుతోంది.

"రంజితగారూ! ఏమయ్యింది? ఎందుకలా కేక పెట్టారు?" అడిగాను అనునయంగా.

ఆమె మాట్లాడలేదు....ఏడుస్తూనే వుంది.

అందరూ ఆమెను వింతగా చూస్తోన్నారు.

అసలు జరిగిందేమిటి?

ఎందుకు యేడుస్తోంది? మహేంద్రకు ఏమీ తెలీదా? ఇద్దరూ ఒకే గదిలో పడుకున్నారు.

"ఏమయ్యింది మమ్మీ...." అడిగింది అరవింద తల్లి భుజంమీద చెయ్యివేసి.

ఆమె మాట్లాడలేదు.

పమిటతో కన్నీళ్ళు తుడుచుకుంది.

"చెప్పండి....మీకు దయ్యం కనిపించిందా?" అడిగేను.

"కనుపించలేదు" అన్నది రంజిత చిన్నగా. ఆమె గొంతు పూడుకుపోయినట్లు అనిపించింది.

"మరెందుకలా కేక పెట్టారు?"

"సారీ.... చెప్పలేను."

"అది మీ పర్సనల్ విషయమా? అలాంటప్పుడు కేక పెట్టవలసిన అవసరం యెందుకు కలిగింది? మీ కేక భయంతో అరిచినట్టుగా అనిపించింది. నిజమేనంటారా?"

"అవును."

"చెప్పండి....ఎందుకు భయం? మీరెందుకు భయపడ్డారు? మీకేదయినా కల వచ్చిందా?"

"అవును."

"ఆ కలలో ఏం జరిగింది?"

"గుర్తులేదు" అన్నదామె మామూలుగా అయిపోయి.

ఆశ్చర్యంగా అనిపించింది ఆమె ప్రవర్తన. రంజిత ఏదో విషయాన్ని దాస్తున్నట్టుగా అనిపించింది. నిజానికి ఆమెకి కల రాలేదు. కలవచ్చి భయపడి అరచినట్లయితే ఆ విషయాన్ని అడగ్గానే చెప్పేది. ఇంత ఆలస్యం చేసేది కాదు. ఆలోచించి అబద్ధం చెబుతోంది. రంజితకు కల రాలేదు. మరి ఏమయ్యింది?

ఇక ఆమెను ప్రశ్నించ దలచుకోలేదు.

"ఆల్ రైట్ .... ఎవరి గదులకు వాళ్ళు వెళ్ళండి. ఎవ్వరూ ఈ మేడలో దయ్యం వుందనే విషయాన్ని గురించి ఆలోచించ వద్దు. ఆలోచిస్తే ఇలాంటి కలలే వస్తాయి. రంజితగారూ! మీరు నిశ్చింతగా పడుకోండి. నేను మీ గది ఎదుటే కుర్చీ వేసుకుని కూర్చుంటాను తెల్లవార్లూ" అన్నాను.

"వద్దు జగదీష్‌గారూ. నేను ఈ గదిలో పడుకోను. అరవింద గదిలో పడుకుంటాను. ఈ గది నాకు కలసి రాలేదు" అన్నదామె.

"మీ యిష్టం" అన్నాను.

అందరూ మౌనంగా ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్ళి

పోయారు.

రంజిత—అరవింద గదిలోకి వెళ్ళింది.

ఆ గదిలో మహేంద్ర ఒక్కడే నిలబడిపోయాడు. ఆయన మొహం అదోలా వుంది. ఎందుకో ఆయన్ను మాట్లాడించాలనిపించలేదు. మొత్తానికి ఆ గదిలో యేదో జరిగింది.

దాన్ని భార్యా భర్తలిద్దరూ దాస్తున్నారు.

ఐదు నిముషాల తర్వాత మహేంద్ర గది తలుపులను మూశాడు.

నిముషం సేపు ఆ గది దగ్గరే నిలబడి నా పహరా మొదలు పెట్టాను. సిగరెట్టు కాలుస్తూ నడుస్తున్నాను.

అరవింద గది దగ్గరకు వచ్చేసరికి రంజిత యేడుపు వినిపించింది.

క్షణం సేపు అక్కడే నిలబడ్డాను.

ఆమె ఆగి ఆగి యేడుస్తోంది.

రంజిత ఎందుకు ఏడుస్తోంది? ఆమె అలా యెందుకు వెర్రిగా కేక పెట్టింది.

6

బయట అంతా వెలుగు. సూర్యుడి కిరణాలు కిటికీ అద్దాలమీద పడి మెరుస్తున్నాయి.

నిద్ర లేచేసరికి ఉదయం పదిగంటలు కావస్తోంది. రాత్రంతా నిద్రలేక పోవటంవల్ల అంత సేపు నిద్ర పోయాను.

కళ్ళు తెరిచేసరికి నా గదిలోవున్న కుర్చీలో అరవింద కనిపించింది.

"గుడ్ మార్నింగ్ డిటెక్టివ్" అన్నది నవ్వుతూ.

ఆమె చేతిలో ఏదో నవల వుంది.

ఆశ్చర్యపోయాను.

"ఎంత సేపయ్యింది మీరు నా గదిలోకి వచ్చి?" అడిగాను.

"ఎన్నిగంటలని అడగండి. ఎనిమిదిన్నరకు వచ్చాను, అప్పటినించీ మీరు నిద్రపోవటాన్ని చూస్తున్నాను. చాలా గాఢమయిన కునుకు తీశారు" అన్నది నవ్వుతూ.

"మంచి అబ్జర్వేషన్.... థాంక్స్ ఫరిట్. ఇక్కడే కూర్చోండి. పదినిముషాల్లో స్నానంచేసి వస్తాను" అని ఆ గదిలోనించి బయటపడ్డాను.

పావుగంట తర్వాత నా గదిలో అడుగుపెట్టాను.

లోపలకు వచ్చేసరికి అరవింద కాఫీ-టిఫిన్‌ను నా టేబిలుమీద వుంచింది.

"థాంక్స్. మీరు నా పట్ల తీసుకుంటున్న ఇంట్రెస్టుకు?" అన్నాను టిఫిన్ ప్లేటు అందుకుంటూ.

"అలా అనకండి. మీరు మా అతిథి...." అన్నది నవ్వుతూ.

టిఫిన్ తింటూ అరవింద అందాన్ని పరిశీలనగా చూశాను.

ఆమె తలస్నానం చేసినట్టుంది. పట్టుకుచ్చులాంటి ఆమె కురులు బయటినించి వస్తున్న గాలికి చిన్నగా కదులుతున్నాయి. ఆమె జుట్టును ముడివేసుకోకుండా చిన్నక్లిప్ పెట్టుకుని వదిలేసింది. మేచింగ్ డ్రెస్. ఆమె అందం నన్ను పరవశుడిని చేస్తోంది.

కాఫీ తాగిన తర్వాత "మీరు నాకో విషయం చెబుతారా జగదీష్‌గారూ" అన్నది అరవింద తన కుర్చీని నాకు దగ్గరగా జరుపుకుంటూ.

"ఏమిటి?"

"రాత్రి మమ్మీ ఎందుకలా కేక పెట్టింది?"

"మీరు విన్నారు కదా! ఆమెకు ఏదో భయం కలిగించే కల వచ్చిందిట."

"అది నిజమేనంటారా?"

"నిజం కాదనే అనుమానం మీకు ఎందుకు వచ్చింది?"

"కల రావటమే నిజమయితే మమ్మీ అంతసేపు ఆగి వుండదు. మనం అడిగిన వెంటనే ఆ విషయాన్ని చెప్పెయ్య వచ్చు. కాని అలా చెప్పలేదు. అందుకే నాకు నమ్మ శక్యంగా లేదు."

ఆశ్చర్యమనిపించింది. అరవింద బాగా తెలివయినది. సహేతుకంగా ఆలోచించగలదు.

"మమ్మీకి దయ్యం కనిపించిందంటారా?" అడిగింది.

"కనిపించలేదని తనే చెప్పింది కదా!"

"అబద్ధం చెప్పిందేమో!"

"ఎందుకు?"

"నిజంగా ఈ ఇంట్లో మమ్మీకి, మీకు తప్పించి ఇంకెవరికీ దయ్యాలున్నాయంటే నమ్మకంలేదు. అటువంటప్పుడు మమ్మీ తనకు దయ్యం కనిపించిందని చెప్పినా ఎవరూ నమ్మరు. ఎందుకంటే మొదటినించీ దయ్యాల గురించి, భయపడుతున్నది తనే. అందుకే ఎవ్వరూ నమ్మకపోగా ఆమె భ్రమపడిందనీ, నిజంగా దయ్యాన్ని చూడలేదనీ అంటారు. తన మాట ఎవ్వరూ నమ్మరు కాబట్టి చెప్పినా ప్రయోజనం లేదని మమ్మీ ఆ విషయాన్ని దాచి వుంచిందేమో."

అరవింద వాదన నన్ను ముగ్ధుడిని చేసింది. ఆమె ఆలోచన సరయినదే. పదిమంది నమ్మకంలేని మనుషుల మధ్య ఒక్క నమ్మకం వున్న మనిషి ఏం చెప్పినా ఉపయోగం

లేదు.

"కాని ఆమెకు నా సపోర్టు వుంది అరవిందగారూ. అటువంటప్పుడు నాకయినా నిజం చెబుతుంది. నాకూడా చెప్పలేదంటే మీ మమ్మీకి దయ్యం కనిపించ లేదు."

"మరెందుకలా కేక పెట్టింది?"

"ఆమెకే తెలియాలి."

అరవింద మాట్లాడలేదు.

ఆలోచిస్తూ గది బయటకు చూశాను.

ఎవరిదో నీడ చిన్నగా కదులుతోంది.

"ఎవరు?" అన్నాను.

"నేనే" అంటూ లోపలకు వచ్చింది రంజిత.

"మీరా. గుడ్ మార్నింగ్" అన్నాను నవ్వుతూ.

అరవింద కుర్చీలోనించి లేచి నా మొహంలోకి చూసింది. అప్పటివరకూ మా ఇద్దరి సంభాషణా ఆమె విన్నదేమో అనిపించింది.

"అప్పుడే లేచారే? పన్నెండు గంటల వరకూ నిద్ర లేవరనుకున్నాను" అన్నదామె కుర్చీలో కూర్చుని.

"నాకు రోజుకు అయిదుగంటల నిద్ర చాలు" అన్నాను.

రంజిత మొహంలోకి చూశాను. ఇంకా ఆమె మొహం అదోలా వుంది. భయం తాలూకు నీడలు ఆమెను పూర్తిగా వదిలిపోలేదు.

"ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఎవరూ లేరా?" అడిగాను.

"లేరు. మనమూ వంటవాడే వున్నది."

మేము మాట్లాడు కుంటున్నప్పుడు అరవింద ఆ గదిలో నించి వెళ్ళిపోయింది.

కూతురు వెళ్ళగానే రంజిత లేచివెళ్ళి గది తలుపులను

దగ్గరగా మూసివచ్చి కుర్చీని నాకు మరింత దగ్గరగా జరుపు కుని "రాత్రి మీకు అబద్ధం చెప్పాను జగదీష్‌గారూ" అన్నది చిన్నగా.

"అనుకున్నాను" అన్నాను.

"ఎలా!" ఆశ్చర్యంగా అడిగింది.

చెప్పాను.

"నిజంగా మీరు తెలివయిన వారు. రాత్రి మీరు ఆ విషయాన్ని గురించి చెప్పమని నన్ను బలవంతం చేస్తారను కుని భయపడ్డాను. ఇంతకీ నేనెందుకలా కేక పెట్టానో చెప్పమంటారా?" అన్నది.

"చెప్పండి" అన్నాను కుతూహలంగా.

"ఆయన నన్ను గొంతు నొక్కి చంపబోయారు."

ఉలిక్కిపడ్డాను.

"నిజంగా!"

"అవును. నన్నెవరో నొక్కినట్టు అనిపించి కళ్ళు తెరిచాను. ఆయన నన్ను రెండుకాళ్ళ మధ్య నొక్కిపట్టి రెండు చేతులనూ నా గొంతు చుట్టూ బిగిస్తున్నారు. ఆయన కళ్ళు ఎర్రగా వున్నాయి. జుట్టంతా రేగివుంది. చూడగానే భయపడ్డాను. అంతే. పెద్దకేక పెట్టాను.

అలా కేక పెట్టగానే ఆయన నన్ను వదిలి లేచి నిల బడ్డారు. తర్వాత మీరు తలుపుల మీద బాదగానే వచ్చి తలుపు తెరిచారు. ఇదీ జరిగింది. అంతమందిలో ఆయన నన్ను గొంతునొక్కి చంపబోయారని ఎలా చెప్ప గలను? అందుకే కలవచ్చి భయపడ్డానని అబద్ధం చెప్పి, అరవింద గదిలో పడుకున్నాను. ఇదీ జరిగింది" గట్టిగా నిట్టూర్పు వదిలింది ఆమె.

"నమ్మశక్యంగా లేదు రంజిత గారూ! ఆయన మిమ్మల్ని గొంతునొక్కి ఎందుకు హత్యచెయ్యాలని అనుకుంటారు? అందుకు తగిన కారణం వుండాలికదా! చెప్పండి. మీ ఇద్దరిమధ్యనా యేవయినా గొడవలు వున్నాయా? మహేంద్రగారు మిమ్మల్ని వదలించుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు అనుమానించారా యెప్పుడయినా?" అడిగాను ఆమె మొహంలోకి చూస్తూ.

"లేదు....ఆయన్ని అనుమానించటంలో అర్థంలేదు. ఆయనకు నేనంటే యెంతో ప్రేమవుంది. మీకు తెలీదు గదా? నేను ఆయన ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. ఇప్పటివరకూ మా మధ్య ఎటువంటి కలతలూ రాలేదు. ఏ విషయం గురించీ మేము ఒకరి నొకరు ద్వేషించుకోలేదు. పెళ్ళి చేసుకున్నందుకు బాధపడలేదు. ఇప్పటికీ నాకేదయినా చిన్నదెబ్బ తగిలితే ఆయనకేమీ తోచదు. ఆయనను అనుమానించటం పాపమే అవుతుంది" అన్నదామె ఆవేశంగా.

"ఆశ్చర్యంగా వుంది. అటువంటి మనిషి రాత్రి మిమ్మల్ని గొంతునొక్కి హత్య చెయ్యాలని యెందుకు ప్రయత్నం చేస్తారు?"

"నాకూ అదే అంతుబట్టలేదు. అందుకే రాత్రి యీ విషయాన్ని మీ అందరిముందూ చెప్పలేకపోయాను. చెప్పాననుకోండి....పిల్లలముందు ఆయన గౌరవం ఏమవుతుంది? వాళ్ళందరూ ఆయనంటే భయపడతారుకదా! ఇవన్నీ ఆలోచించే రాత్రి నేను అబద్ధం చెప్పాను. కాని తర్వాత ఆలోచిస్తే నాకో ఆలోచన వచ్చింది" అన్నది రంజిత.

"ఏమిటి?"

"దయ్యాలు మనుషుల్ని ఆవహిస్తాయని అంటారు. అలాగే ఈ మేడలోవున్న దయ్యం ఆయనని రాత్రి ఆవహించిందేమోనని అనుమానంగా వుంది. ఆయన్ని గమనించారా? ఆయన జుట్టు రేగిపోయి వుంది. ఆయన కళ్ళు ఎర్రగా వున్నాయి...." చెబుతోంది రంజిత.

ఆలోచిస్తున్నాను.

ఈ మేడలో దయ్యం వుందా?

7

రాత్రి పన్నెండు గంటలయింది. మేడలో నేనొక్కడినే మెలకువతో వున్నాను. మిగిలిన అందరూ గాఢ నిద్రలో మునిగి వున్నారు—ఎవరి గదుల్లో వాళ్ళు పడుకొని.

రంజిత ఈరోజు రాత్రికూడా అరవింద గదిలోనే పడుకొంది. ఆమె ఆలోచన నిజమే అయి వుండవచ్చు. మహేంద్రను నిజంగా దయ్యం ఆవహించి వుండవచ్చు. అందుకే ఆయన తను యెంతో గాఢంగా ప్రేమించే భార్యను గొంతునొక్కి చంపెయ్యాలనే ప్రయత్నం చేశాడు. బహుశ అలాంటి ప్రయత్నం యీ రాత్రికి కూడా జరగవచ్చు. అందుకే రంజితను అరవింద గదిలో పడుకోమని చెప్పాను.

మేడనంతా ఓసారి చుట్టివచ్చాను. వాతావరణమంతా మామూలుగా వుంది. ఆ మేడలో దయ్యం వున్నదంటే ఎవ్వరూ నమ్మలేరు. నాకు కూడా నమ్మకంగా లేదు. ఉందోలేదో తేల్చుకోవాలి. రాత్రి జరిగిన సంఘటన ఒక్కటే ఇందుకు సరిపోదు.

సిగరెట్టు పొగ గాలిలో పైకి పోతోంది. మేడలో అక్కడక్కడా దీపాలు వెలుగుతున్నాయి.

ఒకసారి తోటలోకి వెళ్ళి చూడాలనిపించింది.

సగంవరకు కాలిన సిగరెట్టును విసిరి మరో సిగరెట్టును ముట్టించాను.

రాత్రిలాగే అరవింద ఈ రాత్రికూడా నాకు కంపెనీ ఇస్తే బావుండే దనిపించింది. కాని ఇక నాకు అటువంటి అవకాశం రాదు.

బయటకు వచ్చాను.

గాలి రివ్వున వీస్తోంది. చెట్లు అటూయిటూ వూగుతూ వున్నాయి పూనకం వచ్చిన మనుష్యుల్లా.

బయట చాలావరకు చీకటిగా వుంది.

కొంచెంసేపు తోటబయటే నిలబడిపోయాను సిగరెట్టు కాలుస్తూ.

దయ్యాలు గురించీ అవి చేసే సాధారణమయిన పనుల గురించీ ఆలోచిస్తున్నాను.

దయ్యాలు నడుస్తుంటే గజ్జల చప్పుడు వినిపిస్తుందనీ, అవి నవ్వుతాయనీ ఏవేవో వింతపనులు చేస్తాయనీ విన్నాను. చాలా పుస్తకాల్లో చదివాను.

కాని—ఈ మేడలో అటువంటివి ఏవీ జరగటంలేదు.

ఆలోచిస్తున్న వాడిని ఒక్కసారి ఉలిక్కిపడ్డాను.

నా పెదవుల మధ్యవున్న సిగరెట్టు ఎవరో లాగిపారేసినట్టు వెళ్ళి నా ముందు దూరంగా పడింది.

కళ్ళు పెద్దవి చేసుకొని చుట్టూ చూశాను.

ఎవ్వరూ కనిపించలేదు.

రివ్వున వీస్తున్న గాలికి కిందపడిన సిగరెట్టు మీదనించి నిప్పురవ్వలు వీస్తున్నాయి. గాలి సిగరెట్టు పీకను గబగబా ముందుకు నెట్టుకు వెళ్ళింది.

స్థాణువులా అక్కడే నిలబడిపోయాను.

ఏమిటిది? సిగరెట్టు ఎలా కింద పడిపోయింది?

గాలికి పడిపోయిందా లేక ఎవరయినా అదృశ్యంగా వుండి లాగి పారేశారా? అలా అయితే ఎవరు ఆ పని చేసింది? దయ్యమా?

తోటలో చెట్లు వూగుతూ కీచుమంటూ శబ్దాలు చేస్తున్నాయి.

ప్యాంటు జేబులోనించి సిగరెట్టు ప్యాక్ బయటకు తీసి ఓ సిగరెట్టును పెదవులమధ్య పెట్టుకుని అగ్గిపుల్ల గీసి ముట్టించబోయాను.

అగ్గిపుల్ల టప్ న ఆరిపోయింది ఎవరో వూదినట్టు.

మరోపుల్ల వెలిగించాను.

మళ్ళీ అలాగే జరిగింది.

ఐదు పుల్లలు ఆరిపోయాయి. సిగరెట్టు వెలగలేదు.

నిజంగా షాక్.

ఎంత గాలి వీస్తున్నా మొదటి అగ్గిపుల్లకే సిగరెట్టు వెలిగించటం నాకు బాగా అలవాటు.

కాని ఇప్పుడు ఐదు పుల్లలు గీసి నా సిగరెట్టు అంటు లేదు.

అంటే? ఎవరో సిగరెట్టు అంటుకోకుండా ప్రయత్నము చేస్తున్నారు.

ఎవరు?

దయ్యమేనా?

ఎవరో నవ్వారు....గలగలా.

ఏమిటి ఇదంతా?నిజంగా జరుగుతున్నదా? నా భ్రమా?

చెవులు రిక్కించాను.

సందేహంలేదు. నా వెనక ఎవరో నవ్వుతున్నారు చిన్నగా—నా చెవులో నవ్వుతున్నట్టు అనిపించింది.

వెనక్కి తిరిగాను గబుక్కున.

ఎవ్వరూ కనిపించలేదు.

ఆ నవ్వు నిమిష నిమిషానికీ పెరిగిపోతోంది. భరించ లేకుండా వున్నాను.

ఏమిటీ సస్పెన్స్?

ప్యాంటు జేబులోనుంచి పెన్ టార్చి లైటును బయట తీశాను.

వెలిగించి చుట్టూ ఫోకస్ చేశాను.

ఏమీ లేదు....

చూస్తున్నాను....గబుక్కున యెవరో నన్ను రాసుకుంటూ వెళ్ళినట్టు ఫీలయ్యాను.

పక్కకు తిరిగాను.

ఏమీ కనిపించలేదు.

ఇక భరించలేక పోయాను.

"ఎవరూ?" అన్నాను ధైర్యంగా.

జవాబు లేదు.

నా చెవిలో నవ్వినట్టనిపించింది.

"మాట్లాడరేం? ఎవరు?"

మళ్ళీ అదే నవ్వు. ఎవరో నడివయసు స్త్రీ నవ్వు.

"ఎందుకీ నవ్వు? ధైర్యముంటే కనిపించు...."

అలా అన్నవెంటనే నా చెవిలో వినిపిస్తోన్న నవ్వు ఆగిపోయింది.

తోటలో ఎవరో నడిచిన చప్పుడు వినిపించింది. కళ్ళు చిట్లించి చూశాను.

ఎవరో చెట్టు దగ్గర నిలబడినట్లు లీలగా అనిపించింది.

టార్చిని అటువేపు ఫోకస్ చేశాను.

నా ఆశ్చర్యం వర్ణనాతీతం.

చెట్టు మొదట్లో ఓ లంబాడీయువతి నిలబడి నవ్వుతోంది.

ఒక్క-క్షణం....

అంతే! టార్చి ఆరిపోయింది.

ముందుకు పరుగుదీయబోయాను.

కాని ఇంతలోనే మేడలో ఓ మగాడికేక ప్రతిధ్వనించింది.

వెనక్కు తిరిగి మేడలోకి పరుగుదీశాను.

8

నేను పైకి వెళ్ళేసరికి చంద్రం గదిముందు పోగయినారు—అందరూ.

గదిబయట బోర్లా పడివున్నాడు చంద్రం. అతని తలలోంచి నెత్తురు కారుతోంది సన్నగా.

అతను స్పృహలో లేడు.

"ఏమయ్యింది?" అడిగాడు మహేంద్ర.

"ఏమో....తోటలో వున్నాను. కేక వినిపించింది. పరిగెత్తుకొంటూ వచ్చాను. ముందు నీళ్ళు తీసుకురండి" అన్నాను.

నౌకరు పరిగెత్తుకొని వెళ్ళి గ్లాసులో నీళ్ళు తీసుకు వచ్చాడు.

నీళ్ళను చంద్రం మొహంమీద చల్లాను. అతను కొంచెం అటూయిటూ కదిలాడు.

ప్యాంటు జేబులోనించి కర్చీఫ్ తీసి అతని తలకు కట్టు కట్టాను నెత్తురు కారకుండా. అంత పెద్ద గాయం కాలేదు. లేకపోతే అతన్ని అప్పటికప్పుడే హాస్పిటల్లో అడ్మిట్ చెయ్యవలసి వచ్చేది.

అందరూ భయంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నారు.

పది నిమిషాలకు చిన్నగా కళ్లు తెరిచాడు చంద్రం.

చుట్టూవున్న మనుషులను అదోలా చూశాడు.

"చంద్రంగారూ....ఏం జరిగింది? చెప్పండి. మిమ్మల్ని యెవరో తలమీద కొట్టారు....ఎవరు?" అడిగాను.

అతను ఓసారి చేతితో తలమీద తడుముకుని బాధగా మొహాన్ని పెట్టి "ఎవరో నాకు తెలీదు. బాత్‌రూమ్‌కి వెళ్ళి వస్తున్నాను. ఇక్కడకు రాగానే తలమీద బల మయిన దెబ్బ తగిలింది. అంతే. కేక పెట్టాను. తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు" అన్నాడు బలహీనంగా.

"మీకు ఎవరయినా కనిపించారా లీలగా అయినా?"

"లేదు....కాని పడిపోతున్నప్పుడు ఎవరో పరిగెత్తు తున్నట్టు అనిపించింది."

"ఎటువైపుకు?"

"నా వెనుక వైపుకు."

"అంటే కిందికి దిగటానికి రెండోవేపునున్న మెట్ల వేపు."

"అవును" అన్నాడు చంద్రం. ఆశ్చర్యం....అటువైపు నించే నేను పైకి వచ్చాను.

"మీ వెనుక వైపువున్న గదుల్లో వుంటున్నది అందరూ ఆడవాళ్ళే. మగవాళ్లు యెవ్వరూ లేరు. ఆడవాళ్ళలో మిమ్మల్ని ఎవరు కొడతారు?" అడిగాను.

చిన్నగా నవ్వాడతను. తర్వాత "నేనేం చెప్పేది. నాకు అంతా అయోమయంగా వుంది. మీరే పరిశోధించి కనుక్కోండి" అన్నాడు.

"మిమ్మల్ని కొట్టింది మనిషేనని ఒప్పుకుంటారా?" అన్నాను.

"తప్పకుండా" అన్నాడు.

"అయితే అందరూ వినండి. ఈ మేడలో దయ్యం తిరుగుతోంది" చెప్పాను నా అనుభవాన్ని గుర్తుతెచ్చుకుని.

"వ్వాట్!" అదిరి పడ్డారు అందరూ.

"అవును.... ఈ మేడలో నిజంగానే దయ్యం వుంది. మామూలు దయ్యంకాదు....లంబాడీ దయ్యం."

"లంబాడీ దయ్యమా?" అన్నాడు మహేంద్ర.

"అవును."

"ఎలా చెబుతున్నారు? మీకు కనిపించిందా?" అడిగాడు చంద్రం.

తల వూపాను.

"ఎప్పుడు? ఎక్కడ?" అరవింద అడిగింది.

"తోటలో చూశాను" అని బయట జరిగినదంతా వాళ్ళతో చెప్పాను.

రంజిత నా కళ్ళలోకి భయంగా చూసింది.

"నేను నమ్మను" అన్నాడు మహేంద్ర.

"నేనుకూడా నమ్మను" అన్నాడు చంద్రం.

"నాకూ నమ్మకంగాలేదు" అన్నాడు సురేష్.

"నేను నమ్ముతాను" అన్నది రంజిత.

"థాంక్స్ రంజితా. ఈ యింట్లో మీరు తప్ప ఇంక యెవ్వరు ఈ మేడలో దయ్యం తిరుగుతుందంటే నమ్మటం లేదు. నేను నాకు జరిగిన అనుభవాన్ని చెప్పాను. అయినా యెవరూ నమ్మలేదు. అంటే నా మాటమీద యెవరికీ నమ్మకం లేదన్నమాట. నామాట మీద నమ్మకం లేని క్లయింట్ల తరఫున నేను ఏ కేసునూ పరిశోధించను. మిస్టర్ మహేంద్రా! నేను ఈ కేసునించి విరమించు కుంటున్నాను. ఇప్పుడే ఈ మేడను వదలి వెళ్ళిపోతు న్నాను" అన్నాను.

అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"ప్లీజ్....మీరు కోపం తెచ్చుకోకండి జగదీష్‌గారూ! మీ మాటలను నేను నమ్ముతున్నాను. ఈ మేడలో దయ్యం వుంది. ఇంకెవ్వరూ నమ్మక పోవచ్చు. కాని ఇది నిజం. పదండి. మీతో పాటే నేనుకూడా ఈ మేడను వదలి వచ్చేస్తా..." అన్నది రంజిత.

"ఆంటీ....నీకేమయినా మతిపోయిందా? మనకెవ్వరికీ కనిపించని ఆ లంబాడీ దయ్యం ఒక్క డిటెక్టివ్ గారికే యెందుకు కనిపించింది? ఆ దయ్యానికి మనల్ని చూస్తే భయమా? నువ్వే ఆలోచించు. ఈ మేడలో నిజంగా ఏ దయ్యమూ లేదు. అంతా జగదీష్‌గారి భ్రమ" చంద్రం అన్నాడు.

నాకు అటువంటి పరిస్థితిలోనూ నవ్వొచ్చింది.

"ఓ. కే. మిస్టర్ చంద్రం. ఈ మేడలో దయ్యం లేదు. అయితే యింతకు ముందు మిమ్మల్ని వెనకనుంచి కొట్టింది ఎవరంటారు?" అడిగాను.

"ఎవరో మనిషే అయివుండాలి" అన్నాడతను.

"ఎవరా మనిషి?"

"ఏమో....నాకు తెలీదు."

"ఆలోచించండి. ఈ ఇంట్లోవున్న మనుషులందరూ మీకు తెలుసు. వాళ్ళలో మిమ్మల్ని వెనకనించి కొట్ట వలసిన అవసరం యెవరికి వుంది?"

"అయితే ఇంతకీ మీరేమంటారు? నన్ను ఆ లంబాడీ దయ్యమే కొట్టిందంటారా?"

"అవును."

"ఎందుకు?"

"భయపెట్టటానికి."

"ఎందుకు భయపెట్టటం?"

"ఈ మేడను వదలి మనమంతా వెళ్ళిపోవటానికి.... నిన్నరాత్రి రంజితగారు ఎందుకలా కేకపెట్టారో మీకెవ రికీ తెలీదు. మహేంద్రగారు ఆమెను గొంతునొక్కి హత్యచెయ్యబోయారట్ట" అన్నాను.

అందరూ ఉలిక్కిపడ్డారు. భయంగా మహేంద్రను చూశారు.

"నాకేం తెలీదు...." అన్నాడు మహేంద్ర.

"నిజమే....మీకేమీ తెలీదు. ఈ మేడలో వుంటున్న లంబడీ దయ్యం మిమ్మల్ని ఆవహించింది. అందుకే మీరు అలా చేశారు. ఇప్పటికయినా మీరు యీ మేడలో లంబాడీదయ్యం ఉన్నదని నమ్మి ఈ మేడనువదిలి వెళ్ళండి. దిసీజ్ మై రిక్వెస్ట్" అన్నాను అందరితో.

"ఏమో....మీరు ఎన్నయినా చెప్పండి. దయ్యాలు ఉన్నాయంటే నేను నమ్మను. ఇది ఆధునిక యుగం. ఈ కాలంలోకూడా దయ్యాలేమిటి? దిసీజ్ ఆల్ బోగస్. ఐడోంట్ బిలీవ్ దీస్ డెవిల్స్" అన్నాడు చంద్రం.

నేనేదో మాట్లాడబోయాను.

ఇంతలోనే అతను పెద్దకేకపెట్టి వెనక్కి పడిపోబోయాడు. గబుక్కున అతన్ని పడిపోకుండా పట్టుకున్నాను. అతను నిలవలేదు. పూనకం వచ్చినవాడిలా వూగిపోయాడు.

తర్వాత పెద్దగా నవ్వాడు. నాకు ఒళ్ళు జలదరించింది ఆ నవ్వు వినగానే. రంజిత భయంగా నాకేసి చూసింది. మిగిలిన అందరూ కళ్ళు పెద్దవిచేసి భయంతో చంద్రాన్ని చూస్తున్నారు.

"ఒక్కరోజు గడువిస్తున్నాను. ఈ మేడను వదిలి

వెళ్ళిపొండి. ఈ మేడ నాది. ఈ మేడలో మూడుతరాల కిందట నేను దాచుకున్న నిధినిక్షేపాలున్నాయి. ఈ మేడలో యెవ్వరూ వుండటాన్ని నేను సహించలేను. అందుకే మిమ్మల్ని ప్రాణాలు తియ్యకుండా హెచ్చరిస్తున్నాను. వెంటనే ఈ మేడవదలి ప్రాణాలమీద ఆశ వుంటే వెళ్ళిపొండి. ఇదే చివరి హెచ్చరిక....హి....హి ...హి" అని పెద్దగా పిచ్చివాడిలా నవ్వటం మొదలు పెట్టాడు చంద్రం.

అందరూ భయంతో వణికిపోవటం గమనించాను. ప్రతి ఒక్కరికీ చెమటలుపట్టాయి. రంజిత కళ్ళు భయంతో బెదురుతున్నాయి.

నిముషం తర్వాత చంద్రం నా చేతుల్లో నీరసంగా ఒరిగిపోయాడు.

ఐదు నిమిషాల తర్వాత అందరూ ఆ భయంనించి తేరుకున్నారు.

"క్షమించండి జగదీష్‌గారూ. మీ మాటలను నమ్మనందుకు. ఇప్పుడే ఈ మేడను ఖాళీచేసి వెళ్ళిపోదాం" అన్నాడు మహేంద్ర.

తల వూపాను సిగరెట్టు ముట్టించుకుంటూ.

—: ఐపోయింది :—